# కల్యాణలక్ష్మి లాంటి పథకం ఏడా లేదు

- మహిళలు కేంద్రబిందువుగా బీఆర్ఎస్ హయాంలో పథకాలు
- మేనిఫెస్టోలో లేని పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌ది
- సీఎం రేవంత్ మాటలు విడ్డూరంగా ఉన్నాయి
- కోసుకు తినండి, కాల్చుకొని తినండి అని సీఎం స్థాయి వ్యక్తి అనొచ్చా..
- చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే సబితారెడ్డి


కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్ పేట్, మే 15: ప్రపంచంలో ఎక్కడా లేని కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లాంటి పథకాలను మొట్ట మొదటిసారిగా తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశపెట్టిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మహేశ్వరం మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సబితారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలో ఏ పథకం ప్రవేశపెట్టినా మహిళలను కేంద్ర బిందువుగా తీసుకొని పెట్టడం జరిగిందని గుర్తు చేశారు. ఎవరు అడగకుండానే మహిళల, ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చిన చరిత్ర కేసీఆర్‌ది అన్నారు. మేనిఫెస్టోలో లేని పథకాలను కూడా ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌ది అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో కాన్పులను ప్రోత్సహించడానికి ఆడ బిడ్డ పుడితే రూ.13వేలు, మగబిడ్డ పుడితే రూ.12వేలు ఇవ్వడం జరిగిందన్నారు. తల్లీ బిడ్డ సురక్షితంగా ఉండాలన్న ఉద్దేశంతో కేసీఆర్ కిట్టు తీసుకురావడం జరిగిందన్నారు. ఆసుపత్రి నుంచి ఇంటికి పోయేవరకు ప్రభుత్వ ఖర్చుల ద్వారానే పంపడం జరిగిందన్నారు. అలాంటి పథకాలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించడం బాధాకరమన్నారు. కెసిఆర్ కిట్టును వెంటనే పునరుద్ధరించాలని ఆమె డిమాండ్ చేశారు.

### హామీలు నెరవేర్చే వరకు ప్రశ్నిస్తూనే ఉంటాం..

ఆడబిడ్డలు బిందెలు తీసుకొని రోడ్లపైకి రాకుండా ఉండటానికి మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి మంచినీళ్లు ఇచ్చామన్నారు. రైతుల కోసం రైతుబంధు ప్రవేశపెట్టామని.. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు రాలేదన్న ఒక్కరైతును చూపించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధు బంద్ఐ పోయిందన్నారు. ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేసేవరకు ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. కల్యాణ లక్ష్మితోపాటు తులం బంగారం ఇస్తామని వాగ్దానం చేసి 500 రోజులవుతున్నా ఎందుకు అమలు చేయడం లేదో సమాధానం చెప్పాలని ప్రభుత్వాన్ని సబితారెడ్డి నిలదీశారు. హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందన్నారు.

### సీఎం స్థాయి వ్యక్తి అలా మాట్లాడవచ్చా..

రాష్ట్ర పరిస్థితి బాగాలేదని, అప్పులు ఎవరూ ఇవ్వడంలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలు చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారని అన్నారు. దొంగలుగా చూస్తున్నారని, చెప్పులు ఎత్తుకుపోయే వాళ్లు వస్తున్నారని, ఎవరు అపాయింట్మెంట్లు ఇవ్వటంలేదని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కొరుక్కొని తినండి, కాల్చుకొని తినండి అని ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి అనడం మంచి పద్ధతి కాదన్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి రాష్ట్రం దివాలా తీసింది అని చెప్పడం దేనికి నిదర్శనం అన్నారు. వీటన్నిటినీ ప్రజలు గమనిస్తున్నారని.. భవిష్యత్‌లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, పీఏసీఎస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, సహకార సంఘం చైర్మన్ పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్ నాయక్, వైస్ చైర్మన్ యాదయ్య తదితరులు ఉన్నారు.

# అడ్మిషన్ల దందా!

(మొదటిపేజీ తరువాయి)

విద్యార్థి సంఘాల నాయకులు విద్యాశాఖకు ఫిర్యాదులు చేశారు.

### నిబంధనలకు నీళ్లు..

అనుమతులు లేకున్నా అడ్మిషన్లు తీసుకుంటూ రిడ్జ్ బోర్డ్ ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో కౌంటర్ తెరిచారు. చందానగర్ సర్కిల్ 21లోని సురక్ష ఎన్‌క్లేవ్ కాలనీ ప్రధాన రహదారిపై ఉన్న భవనంలో స్కూల్‌కు అనుమతులు రాకముందే అడ్మిషన్ల దందా మొదలుపెట్టారు. జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు సైతం రెసిడెన్షియల్ నిర్మాణంలో కమర్షియల్ కార్యాకలాపాలు ఎలా కొనసాగిస్తారంటూ నోటీసులు జారీ చేశారు. కానీ సదరు నిర్మాణదారులు, స్కూల్ యాజమాన్యం తమకు అన్ని అనుమతులు ఉన్నాయంటూ దర్జాగా పాఠశాల నిర్వహిస్తున్నారు. కమర్షియల్ అనుమతులకు భారీ మొత్తంలో ఫీజు చెల్లించాల్సి వస్తున్నదని, రెసిడెన్షియల్ అనుమతులైతే తక్కువ ఖర్చుతోనే పనవుతుందని అధికారులే వెనకాల ఉండి నిర్మాణదారులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ సొంత లాభాలను చూసుకొని జీహెచ్ఎంసీ ఆదాయానికి భారీ మొత్తంలో గండి పెడుతున్నారు. గృహ సముదాయ భవనంలో పాఠశాల నిర్వహణకు అనుమతులు ఉండవు. కాగా, అనుమతులు లేకుండా రెసిడెన్షియల్ భవనంలో స్కూల్ నిర్వహణకు పూనుకున్న భవన యాజమాన్యానికి నోటీసులు అందజేశామని అధికారులు తెలిపారు.

### ఫీజులు వాళ్లే నిర్ణయిస్తరు..

ఒక్క రిడ్జ్ స్కూలే కాదు.. గ్రేటర్‌లోని చాలా పాఠశాలలు ఇష్టారీతిన ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై భారం మోపుతున్నాయి. వచ్చే విద్యా ఏడాదికి ఇప్పటికే 80 శాతం అడ్మిషన్లు పూర్తయ్యాయి. కనీసం నోటీసు బోర్డుపై ఏ క్లాస్‌కు ఎంత ఫీజు వసూలు చేస్తామో కూడా తెలపకుండా వారికి నచ్చినట్టుగా ఫీజులు వాళ్లే నిర్ణయించేస్తున్నారు. గ్రేటర్‌లోని పాఠశాలల్లో ఎల్‌కేజీకి వసూలు చేస్తున్న ఫీజులు.. ఇంజినీరింగ్, మెడిసిన్, డెంటల్ కాలేజీలు ఫీజుల కన్నా అధికంగా ఉన్నాయి. ఇంజినీరింగ్‌లో గరిష్ఠంగా అధికంగా రూ.2.15 లక్షల ఫీజు ఉంటే.. ఓ పాఠశాలలో ప్రీ ప్రైమరీకి రూ.2.10 లక్షలు వసూలు చేశారు. ఫీజుల కట్టడిపై జిల్లా విద్యాశాఖ అధికారులకు ఎలాంటి నియంత్రణ ఉండక పోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది.

### ఇంటర్నేషనల్ పేర్లతో జరభద్రం..!

అంతర్జాతీయ ప్రమాణాలు అని చెప్పుకుంటున్న పాఠశాలల్లో ప్రమాణాలు సాధారణ పాఠశాలల మాదిరిగానే ఉంటున్నాయని విద్యావేత్తలు స్పష్టం చేస్తున్నారు. ఇంటర్నేషనల్ బోర్డు తగిలించుకున్న పాఠశాలలు ఎల్‌కేజీకి రూ.1.25లక్షలకు వసూలు చేస్తున్నాయి. అయితే హైదరాబాద్ పరిధిలో ఒకటో తరగతి నుంచి 10 వ తరగతి వరకు 773 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలున్నాయి. మరో 3,500 వరకు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలున్నాయి. చాలా విద్యాసంస్థలు ఇంటర్నేషనల్ స్కూళ్ల పేరుతో రాజ్యమేలుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకున్నా దర్జాగా బోర్డులు తగిలించుకొని దందా చేస్తున్నాయి. సీఐఎస్(కౌన్సిల్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్కూల్స్) గుర్తింపు ఉన్న పాఠశాలలు మాత్రమే ఇంటర్నేషనల్ బోర్డులు తగిలించుకోవాలి. ఈ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్న పాఠశాలలను ఆ సంస్థ అన్ని విధాలుగా పరిశీలించి ఆమోదం తెలుపుతుంది. గ్రంథాలయాలు, ప్రయోగశాలలు, బోధన సామగ్రిలాంటి 25 అంశాలను పరిగణలోకి తీసుకుని గ్రేడింగ్స్ జారీ చేస్తుంది. కానీ నగరంలోని చాలా పాఠశాలలు గుర్తింపులేకున్నా ట్యాగ్ తగిలించుకుంటున్నాయి.

### అనుమతిలేదని తేల్చేవారేరీ?

పాఠశాల స్థాపించాలంటే విద్యాశాఖ నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. అందులో ముఖ్యంగా మద్యం దుకాణాలు, ప్రార్థన మందిరాలకు పాఠశాలు దూరంగా ఉండాలి. 24 శాఖల నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్(ఎన్ఓసీ) తీసుకోవాలి. భవన రిజిస్ట్రేషన్, అగ్నిమాపకం తప్పనిసరి. అయితే నగరంలో చాలా పాఠశాలలను కేవలం లాభార్జన మీదనే నెలకొల్పుతున్నారు. డీఈడీ, బీఈడీ, లాంగ్వేజ్ పండిట్ కోర్సులను పూర్తి చేయని వారిని ఉపాధ్యాయులుగా నియమించుకుని పిల్లలకు పాఠాలు బోధిస్తున్నారని ఫిర్యాదులు అందినా డీఈవోలు చర్యలు తీసుకోవడం లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ విషయం విద్యా శాఖాధికారుల దృష్టిలో ఉన్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

## 18న భూపతి చంద్ర పురస్కారాలు

సిటీబ్యూరో, మే15 (నమస్తే తెలంగాణ): 'భూపతి చంద్ర స్మారక కథానికల పోటీ-2025' పురస్కారాల ప్రదానోత్సవ సభ ఈనెల 18వ నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు ఎంఎల్ కాంతారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తులో నిర్వహించే ఈ కార్యక్రమానికి సీనియర్ సంపాదకులు కే రామచంద్రమూర్తి, సినీ దర్శకుడు, సాంస్కృతిక ప్రతినిధి బి.నర్సింగరావు, నాగార్జున విశ్వవిద్యాలయ తెలుగుశాఖ పూర్వాధ్యక్షులు మన్నవ సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. ప్రథమ బహుమతి చాగంటి ప్రసాద్(తీరణి రుణం), ద్వితీయ బహుమతి ఉప్పలూరి మధుపత్ర శైలజ(అనుకోని అతిథి),తృతీయ బహుమతి కొండి మల్లారెడ్డి (క్రరెరోడి)బహుమతులందుకోనున్నారని తెలిపారు.

## లక్ష్మీనారాయణకు సన్మానం



ఆబిడ్స్, మే 15: శ్రమశక్తి అవార్డు అందుకున్న జలమండలి ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు జీ లక్ష్మీనారాయణను ఘనంగా సన్మానించారు. గోషామహల్‌లోని కార్యాలయంలో అసోసియేషన్ నాయకు, జలమండలి అధికారులు గురువారం ఆయనను ఘనంగా సన్మానించారు.

## రీడింగ్‌కు ప్రాధాన్యత

సిటీ బ్యూరో, మే 15 (నమస్తే తెలంగాణ): గుణాత్మక విద్యే లక్ష్యంగా బోధన చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు. నాంపల్లి ప్రభుత్వ మోడల్ హైస్కూల్‌లో గురువారం ఉపాధ్యాయులకు ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.




## నోవాటెల్‌లో హైలైఫ్ ఎగ్జిబిషన్

హైటెక్ సిటీలోని హెచ్ఐసీసీ నోవాటెల్‌లో ప్రముఖ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ బ్రాండ్ వారు హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23, 24, 25న నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో క్రియేటివ్ ఫ్యాషన్ వేర్, లైఫ్‌స్టైల్ వేర్, బ్రైడల్ వేర్, యాక్సెసరీస్, జ్యూయలరీతో పాటు అనేక ఆకర్షణీయ ఉత్పత్తులు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. సందర్భంగా పలువురు ప్రముఖ మహిళలు ఎగ్జిబిషన్‌కు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. – సిటీ బ్యూరో, మే 15 (నమస్తే తెలంగాణ):

## గ్రేటర్‌లో కమిషనర్ సుడిగాలి పర్యటన

సిటీబ్యూరో, మే 15 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ గురువారం గ్రేటర్‌లోని పలు ప్రాంతాలలో పర్యటించారు. కాప్రా సర్కిల్‌లోని భవానీనగర్, ఏఎస్ రావు నగర్ డివిజన్లలోని సీనియర్ సిటిజన్స్‌తో కమిషనర్ సమావేశం అయ్యారు. అనంతరం జవహర్‌నగర్ డంపింగ్ యార్డును కమిషనర్ సందర్శించారు.

## తెలంగాణ సినిమాపై ఆంధ్రా ఆధిపత్యం

- గద్దర్ ఫిలిం అవార్డులను తెలంగాణ సినిమాలకే ఇవ్వాలి
- థియేటర్ల మాఫియాను ప్రభుత్వం అరికట్టాలి
- తెంగాణ సినిమా వేదిక డిమాండ్

ఖైరతాబాద్, మే 15: ప్రత్యేక రాష్ట్రంలో నేటికీ తెలంగాణ సినిమాపై ఆంధ్ర ఆధిపత్యం కొనసాగుతోందని, దీనిని ఎట్టి పరిస్థితుల్లో సహించమని తెలంగాణ సినిమా వేదిక స్పష్టం చేసింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వేదిక రాష్ట్ర కన్వీనర్ లారా, కోకన్వీనర్ మోహన్ బైరాగి, గౌరవ సలహాదారుడు ప్రఫుల్ రాంరెడ్డి తెలంగాణ సినిమాకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. రాష్ట్రంలో తెలంగాణ ఫిలిం ఛాంబర్ పేరుకే ఉందని, చిన్న సినిమాలకు థియేటర్లు దొరకడం లేదన్నారు. కొందరు ఆంధ్ర సినీ పెద్దల చేతుల్లో థియేటర్లు ఉన్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో థియేటర్ మాఫియా సాగుతోందన్నారు. 1993 అక్టోబర్ 4న మూవీ ఆర్టిస్టు అసోసియేషన్ (MAA) ఏర్పడిందని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినా ఇంకా ఉమ్మడిగా ఎందుకు కొనసాగుతున్నది ప్రశ్నించారు. ఫిలిం చాంబర్‌లు ఆంధ్రా, తెలంగాణ వేర్వేరుగా ఉండాలని, కానీ ప్రస్తుత చాంబర్‌లోఆంధ్రా పెత్తనం కొనసాగుతోందన్నారు.

### తెలంగాణ సినిమాలకే ఇవ్వాలి..

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన గద్దర్ అవార్డులను తెలంగాణ సినిమాలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఆంధ్రా, తెలంగాణ సినిమా రంగాల విభజన జరగాలని, తెలంగాణ ఫిలిం చాంబర్‌లో వెంటనే మార్పులు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇక్కడి సినిమా కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, సీనియర్ కళాకారులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. తెలంగాణ సినిమా రంగంలో 24 క్రాఫ్టుల్లో ఈ ప్రాంతం వారే అధికంగా ఉండాలన్నారు. చిన్న సినిమాలకు నెలకు 14 రోజులపాటు అన్ని థియేటర్లలో అవకాశం ఇవ్వాలన్నారు. తెలంగాణ ఫిలిం ఛాంబర్‌కు నూతన భవనం నిర్మించాలన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల ఆధారంగా నిర్మించే చిత్రాలకు సబ్సిడీ ఇవ్వాలని, చిన్న సినిమాల నిర్మాణంలోనూ రాయితీ కల్పించాలన్నారు. తెలంగాణ సినిమా విభజన జరిగేంత వరకు తమ పోరాటం ఆగదన్నారు. సుల్తాన్ యాదగిరి, జైహింద్ గౌడ్, రఫీ, సురేశ్ రెడ్డి, విష్ణు కృష్ణ, మురళీధర్ దేశ్‌పాండే, పెద్ద యాదగిరి, డోలక్ యాదగిరి పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందించిన యోగా గురువు రామ్‌దేవ్ బాబా, ఉపాధ్యాయులు

## సత్తాచాటిన ఆచార్యకులం విద్యార్థులు

### పది, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు

సిటీ బ్యూరో, మే 15 (నమస్తే తెలంగాణ): పతంజలి ఆధ్వర్యంలో ఆచార్యకులం విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి పదోతరగతి, ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటారని ప్రిన్సిపల్ స్వాతి మున్ని ప్రకటించారు. 99.4 శాతం మార్కులతో అథర్వ్ ప్రథమ స్థానం, 98 శాతం మార్కులతో ధ్రువ్ ద్వితీయ, 97.8 శాతం మార్కులతో సాన్య షెజల్ తృతీయ స్థానంలో నిలిచారని వెల్లడించారు. అదేవిధంగా 153 మంది విద్యార్థులు ఏ1 గ్రేడ్ మార్కులు సాధించారని చెప్పారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆచార్యకులం మేనేజ్‌మెంట్ కమిటీ, ఉపాధ్యాయులు అభినందించారు.

## కంచ పునరుద్ధరణ శాస్త్రీయంగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

లేకుండా ఉంటుందని అభిప్రాయపడ్డారు.

### మియావాకి అశాస్త్రీయ పద్ధతి

కాంగ్రెస్ సర్కార్ యూనివర్సిటీలో వనమహోత్సవం పేరుతో వియవాకి పద్ధతిలో మొక్కలను నాటిందని, అది పూర్తిగా అశాస్త్రీయమని ప్లాంట్ సైన్స్ విద్యార్థులు అంటున్నారు. కంచ గచ్చిబౌలి భూముల్లో గడ్డిని ఆహారంగా తీసుకునే జింకలు, కుందేళ్ల వంటి జంతువులు ఎక్కువగా ఉన్నాయని, మియావాకిలో మొక్కలను నాటడం వల్ల వాటికి ఆహారం దొరకదని చెప్పారు. దీంతో వాటి మనుగడ ప్రశ్నార్థకమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కానుగ, వేప, జామూన్ వంటి చెట్లనే ఎక్కువ నాటుతున్నారని, వాటితో పాటు ఔషధ విలువలున్న మొక్కలు, అరుదైన జాతుల మొక్కలను నాటాలని కోరారు. మియావాకి పద్ధతిలో కాకుండా పర్యావరణ, ఎకాలజీ నిపుణుల సూచనలు పాటిస్తూ ఎంపిక చేసిన మొక్కలను నాటాలని కోరారు.

### ప్లాంట్ సైన్స్ ప్రొఫెసర్లు, ఎకాలజిస్టుల భాగస్వామ్యం తప్పనిసరి

కంచగచ్చిబౌలి భూముల్లో 80 శాతం అటవీ మొక్కలే ఉన్నాయి. కాబట్టి చెట్లను తొలగించిన ప్రాంతంలో వాటినే నాటాలి. పునరుద్ధరణ పనుల్లో యూనివర్సిటీ ప్లాంట్ సైన్స్ డిపార్ట్‌మెంట్ భాగస్వామ్యం ఉండాలి. ప్లాంట్ సైన్స్ ప్రొఫెసర్ల సలహాలు, సూచనలు తీసుకోవాలి. నిపుణులైన ఎకాలజిస్టులు సూచించిన మొక్కలనే నాటాలి. వారు ఆ ప్రాంతంలో నివసించే జీవజాతులకు అనువైన మొక్కలను సూచిస్తారు. దీంతో జంతుజాలం, వృక్షజాలం సమతూకంలో ఉంటుంది. పర్యావరణం వృద్ధి చెందుతుంది. ప్రభుత్వం దీన్ని దృష్టిలో పెట్టుకుని పునరుద్ధరణ పనులు చేపడితే ప్రయోజనకరంగా ఉంటుంది.

– ప్రవీణ్, రీసెర్చ్ స్కాలర్, ప్లాంట్ సైన్స్ డిపార్ట్‌మెంట్, హెచ్‌సీయూ

## ఉద్యోగులను మానసిక వేదనకు గురిచేస్తున్నారు

- రిటైర్మెంట్ బెనిఫిట్లను చివరి పనిదినాన్నే అందించాలి
- బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్


సమావేశంలో మాట్లాడుతున్న సురేష్

చిక్కడపల్లి, మే 15: రిటైర్డ్ అయిన ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన అన్ని రకాల బెనిఫిట్‌లకు సంబంధించిన డబ్బులను ఆఖరి పనిదినాన్నే అందించాలని, ఇప్పటికే ప్రభుత్వం బకాయిపడ్డ నిధులను వెంటనే విడుదల చేయాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గురువారం బాగ్‌లింగంపల్లిలోని సంస్థ కేంద్ర కార్యాలయంలో ఉద్యోగుల, ఉపాధ్యాయుల కన్వీనర్ జోగు శ్రీనివాస్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో దాసు సురేష్ మాట్లాడుతూ.. ఒక్కొక్క ఉద్యోగి దాదాపుగా 30 నుంచి 35 సంవత్సరాలు ప్రభుత్వానికి సేవలు అందించి పదవీ విరమణ చేయగా వారికి రావలసిన పీఎఫ్, గ్రాడ్యూటీ, వేతన సవరణ బెనిఫిట్, జీపీఎఫ్‌లకు సంబంధించిన డబ్బులను ప్రభుత్వం చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఆర్థిక బందులకు గురవుతున్నారని చెప్పారు. పిల్లల పెళ్లిళ్లు, కుటుంబ సభ్యుల ఆరోగ్యం, చదువులకు కావాల్సిన డబ్బులు సర్దుబాటు కాక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

### కాంట్రాక్టర్లకు చెల్లించేందుకు డబ్బులు ఉన్నాయి..

కొంతమంది రిటైర్డ్ ఉద్యోగులు.. ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులకు తీసుకొచ్చి వాటిని తిరిగి సకాలంలో చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వాపోయారు. వీరందరికీ న్యాయం చేయాల్సిన సీఎం రేవంత్ రెడ్డి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క వీరికి ఇవ్వాల్సిన డబ్బులకు నిధులు కేటాయించకుండా ప్రైవేట్ కాంట్రాక్టర్ల బిల్లులు మాత్రం జాప్యం లేకుండా చెల్లించడం ఎంతవరకు సబబు అని సురేష్ ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనల ద్వారా లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని, తెలంగాణ రైజింగ్ అంటూనే మరోపక్క ఇప్పుడు ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని తనను కోసినా రూపాయి రాదని ఉద్యోగులను మానసిక వేదనకు గురిచేస్తున్నారన్నారు. త్వరలో రాహుల్ గాంధీ, రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కలిసి ఉద్యోగుల సమస్యలను వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తులసి సత్య నారాయణ, ఎంబీసీ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సురేశ్ , ఉపాధ్యాయ నాయకులు.. రామ్ మోహన్, బీసీ రాజ్యాధికార సమితి నాయకులు నరేందర్, పద్మావతి, తాళ్ల భాగ్యలక్ష్మి, కరుణశ్రీ, కృష్ణ గౌడ్, జ్యోతి గౌడ్, శారద, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సర్కార్‌కు సుప్రీం మొట్టికాయలు


సమావేశంలో మాట్లాడతున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్, మే 15: కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల నేపథ్యంలో ప్రభుత్వ పెద్దలు, అధికారులకు పలుమార్లు కోర్టులు మొట్టికాయలు వేస్తున్నాయని బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ విమర్శించారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్ణయాలను ఎప్పటికప్పుడు కోర్టులు తప్పు పడుతూనే ఉన్నాయన్నారు. తాజాగా కంచె గచ్చిబౌలి భూముల విషయంలో సుప్రీం కోర్టు కూడా రాష్ట్ర సర్కార్‌కు మొట్టికాయలు వేసిందని అన్నారు. ఇటీవల జరిగిన ఓ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్రస్టేషన్‌లో ఉత్తమ్ కుమార్ రెడ్డి సీఎం అనడంతో ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. ప్రభుత్వ అనాలోచిత, అనుభవరాహిత్య నిర్ణయాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. అధికారం చేపట్టి రెండేళ్లు అవుతున్నప్పటికీ అభివృద్ధి పై చర్చ చేయకుండా బీఆర్ఎస్ పై బురద చల్లుతోందన్నారు. ఇప్పటికే గత ప్రభుత్వంపై పదికి పైగా ఎంక్వారీలు వేశారు ఎక్కడ ఏం రుజువు చేయలేదన్నారు. ఇప్పుడు మళ్లీ ధరణి ఫోరెన్సిక్ అడిట్ అని మళ్లీ ఇంకో ఎంక్వైరీ వేస్తారని ఎద్దేవా చేశారు. ఇకనైనా ఆరోపణలు మాని పనిచేయాలని సూచించారు.

## గండిపేటకు తప్పిన మురుగు ముప్పు

- నమస్తే తెలంగాణ కథనానికి స్పందించిన హైడ్రా
- బుల్కాపూర్ నాలాకు గేట్లు అమర్చిన సిబ్బంది

మణికొండ, మే 15: జంటనగరాలకు తాగునీరు అందించే గండిపేట(ఉస్మాన్‌సాగర్)కు మురుగు ముప్పు తప్పింది. ఖానాపూర్, వట్టి నాగులపల్లి నుంచి వచ్చిన మురుగు నీరు బుల్కాపూర్ నాలా ద్వారా గండిపేటలోకి వెళ్లకుండా హైడ్రా చర్యలు తీసుకుంది. రూ.2 లక్షలు వెచ్చించి బుల్కాపూర్ నాలాకు కొత్త షట్టర్లను ఏర్పాటు చేసింది. వరద వచ్చేటప్పుడు గండిపేటకు చేరేలా కాలువకు ఉన్న షట్టర్లు (గేట్లు) శిథిలమైన విషయం విదితమే. మురుగు నీరు గండిపేటలో కలుస్తున్నదని ఇటీవల 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనాలపై హైడ్రా స్పందించింది. అధికారుల బృందంతో కలసి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వెంటనే షట్టర్ల మరమ్మతులను చేపట్టాలని అధికారులను హైడ్రా కమిషనర్ ఆదేశించారు.


గండిపేట చెరువులోకి మురుగు వెళ్లకుండా ఖానాపూర్ వద్ద అమర్చిన గేట్లు

### షట్టర్లు అమర్చిన సిబ్బంది..

శిథిలమైన షట్టర్ల స్థానంలో కొత్తవి అమర్చడంతో మురుగు నీరు గండిపేట చెరువులోకి వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. అలాగే బుల్కాపూర్ నాలాలో పూడికపోయిన చెత్తను కూడా కొంతమేర తొలగించి మురుగు ముందుకు సాగేలా ఏర్పాట్లు చేశారు. ఒకప్పుడు వరద కాలువగా ఉన్న బుల్కాపూర్ నాలాలో పైన ఉన్న నివాసాలు, వాణిజ్య సముదాయాలు, రిసార్టుల నుంచి మురుగు నీరు ప్రవహిస్తోంది. శంకరపల్లిలోని బుల్కాపూర్ చెరువు నుంచి ఖానాపూర్, కోకాపేట, నార్సింగ్, పుప్పాలగూడ, మణికొండ, దర్గా, షేక్‌పేట్, టోలిచౌకి , పోచమ్మ బస్తీ, చింతల బస్తీ మీదుగా హుస్సేన్ సాగర్‌కు వర్షపు నీరును తీసుకెళ్లే చరిత్ర ఈ నాలాది. బుల్కాపూర్ నాలాను పూర్తి స్థాయిలో పునరుద్ధరిస్తే చాలా ప్రయోజనాలుంటాయని.. హుస్సేన్ సాగర్‌కు వర్షపు నీటిని తీసుకువచ్చే ఏకైక నాలాగా దీనికి ప్రత్యేక స్థానం ఉందని స్థానికులు తెలిపారు. ఇప్పుడీ నాలా పునరుద్ధరణపై హైడ్రా దృష్టి పెట్టింది.



మెడల్స్ సాధించిన క్రీడాకారులతో అతిథులు

## బ్యాడ్మింటన్ చాంప్ రుజుల

### ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: జ్వాల గుత్తా అకాడమీ వేదికగా జరిగిన ఆల్‌ఇండియా సీనియర్ బ్యాడ్మింటన్ టోర్నీలో జిన్‌పాల్, రుజుల రాము విజేతలుగా నిలిచారు. గురువారం ముగిసిన టోర్నీలో పురుషుల సింగిల్స్ ఫైనల్లో జిన్‌పాల్ 21-19, 17-21, 22-20తో లక్షయ్ శర్మపై గెలిచి టైటిల్ దక్కించుకున్నాడు. మహిళల సింగిల్స్ తుదిపోరులో రుజుల రాము 9-21, 21-18, 21-18తో మాన్సిసింగ్‌పై గెలిచింది. పురుషుల డబుల్స్ ఫైనల్‌లో అమన్, డింకూ సింగ్ జోడీ 21-18, 21-19తో దీప్ రామ్‌భయ్యా, ప్రతీక్ రనాడే ద్వయంపై విజయం సాధించారు. మహిళల డబుల్స్ ఫైనల్లో అమృత, సోనాలీసింగ్ జోడీ గెలువగా, మిక్స్‌డ్ డబుల్స్ తుది పోరులో సాత్విక్‌రెడ్డి, రాధికాశర్మ ద్వయం టైటిళ్లు సొంతం చేసుకున్నారు. పోటీల ముగింపు కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి హాజరై ట్రోఫీలు అందజేశారు.